



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL    ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి    ఆదివారం 20-08-2023    సంపుటి : 04    సంచిక : 310 పేజీలు : 8    వెల : రూ 3-00

# యూఎస్ తెలుగు విద్యార్థుల ఉదంతంపై సీఎం జగన్ ఆరా



అమరావతి: అమెరికా నుంచి కొంత మంది తెలుగు విద్యార్థులు వెనక్కి పంపిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరా తీశారు. విద్యార్థుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన వారి సమస్యను పరిష్కరించాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. 21 మంది భారతీయ విద్యార్థులను అమెరికా నుండి వెనక్కు పంపించిన ఘటన సంచలనం సృష్టించింది. వీరిలో తెలుగువారు కూడా ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ ఉదంతంపై అరా తీశారు. విద్యార్థుల పూర్తి వివరాలతో పాటు పూర్తి సమాచారాన్ని సేకరించాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై దృష్టి సారించాలని చెబుతూనే అవసరమైతే విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు కూడా జరపాలని సీఎంవో అధికారులకు సూచించారు.ఎన్నోఆశలతో ఉన్నత విద్య నిమిత్తం అమెరికా చేరుకున్న తాము అన్ని డాక్యుమెంట్లను సమర్పించామన్నారు విద్యార్థులు. ఇమ్మిగ్రేషన్ అధికారులు వారి పత్రాలను తనిఖీ చేసి, కొద్దిసేపు విచారించాక కారణం చెప్పకుండానే వారిని వెనక్కి పంపించేశారు. వారిలో అత్యధికులు అట్లాంటా, చికాగో, శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయాలలో దిగారు.

## లోకేష్‌ది ఫ్లాప్ యాత్ర, అందుకోసమైనా విజయవాడ రావాల్సిందే: దేవినేని అవినాష్



విజయవాడ: లోకేష్‌ది పాదయాత్ర కాదని.. ఈవెనింగ్ వాక్ అంటూ విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్ దేవినేని అవినాష్ ఎద్దేవా చేశారు.విజయవాడకు టీడీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, లోకేష్ పాదయాత్రను అడ్డుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. సీఎం జగన్ చేసిన అభివృద్ధిని లోకేష్ చూడాలని, అందుకోసమైనా రావాల్సిందేనని అవినాష్ పేర్కొన్నారు.దేవినేని అవినాష్ శనివారం సాక్షి మీడియాతో మాట్లాడుతూ, విజయవాడ ప్రజలకు, కనకదుర్గమ్మ అమ్మవారికి టీడీపీ తరపున నారా లోకేష్ క్షమాపణ చెప్పాలి. క్షమాపణ చెప్పిన తర్వాతే లోకేష్ విజయవాడలో నడవాలన్నారు. దుర్గగుడిలో క్షుద్రపూజలు చేయించిన పార్టీ టీడీపీ. బెజవాడ టీడీపీలో బఫూన్లు.. జోకర్లకు నా సూటి ప్రశ్న. సిగ్గుంటే మీ హయాంలో రిటైనింగ్ వాల్ ఎందుకు కట్టలేకపోయారో సమాధానం చెప్పాలన్నా రు."వరదలొస్తే ప్రజలకు ఇబ్బందుల పడకుండా రిటైనింగ్ వాల్ పూర్తి చేసిన గొప్ప నాయకుడు సీఎం జగన్. లోకేష్ పాదయాత్ర గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. అందుకే జాకీలేసి లోకేష్‌ను లేపాలని చూస్తున్నారు. పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అవ్వడంతో నీచపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. వాళ్లలో వాళ్లే గొడవలు పడి బ్యానర్లు చించేస్తున్నారని మా పై బురద జల్లుతున్నారు. పాదయాత్ర పేరు చెబితేనే టీడీపీ నేతలు భయపడిపోతున్నారు. ఖర్చు తట్టుకోలేక.. జనాన్ని తీసుకురాలేక... తలలు పట్టుకుంటున్నారు" అంటూ దేవినేని అవినాష్ చురకలు అంటించారు.ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంకి, నారా లోకేష్ పాదయాత్రకు తేడాలేదు. లోకేష్ పాదయాత్రను అడ్డుకోవాల్సిన అవసరం లేదు. లోకేష్ విజయవాడ నగరమంతా నడవాలని కోరుకుంటున్నా.. సీఎం జగన్ చేసిన అభివృద్ధిని చూడాలని కోరుతున్నానని అవినాష్ అన్నారు.బుద్ధావెంకన్న వ్యాఖ్యలకు దేవినేని అవినాష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

## ఘనంగా లలిత జ్యువెలర్స్ ప్రారంభోత్సవం...

### హాజరైన ప్రముఖులు...

కర్నూలు ఆగష్టు 19 విభారె న్యూస్.పట్టణంలో శనివారం లలిత జ్యువెలర్స్ షోరూం ఘనంగా ప్రారంభం జరిగింది. కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి,కర్నూలు ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే ఎస్ సుధాకర్, నగర మేయర్ బి వై రామయ్య,డిప్యూటీ మేయర్ రేణుక లతోపాటు లలిత జ్యువెలర్స్ అధినేత కిరణ్ హాజరై ప్రారంభించారు.అనంతరం షోరూం మొత్తం తిరిగి ఇలాంటి ఆభరణాలు ఉన్నాయో చూశారు.పేద మధ్య తరగతి కుటుంబాలకు అనుగుణంగా ఉండేలా ధరలను ఉంచి వారి కల సహకారం చేయడమే మా ప్రధాన ఉద్దేశం అని ఎండి కిరణ్ అన్నారు.మేము మిగతా షోరూంలో ఉండే ధరలను గానీ వాటి నాణ్యతను గాని వేరేది చూపమని ప్రజలు వారికి వారే తెలుసుకొని మా దగ్గర ఉన్న ధరలు గానీ నాణ్యతను గాని కనుక్కొని కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా అందరికీ అందనంత దూరంలో ఉన్న బంగారాన్ని మధ్యతరగతి కుటుంబాలకు చేరువయ్యేలా చేస్తున్న లలిత జ్యువెలర్స్ ను అక్కడికి వచ్చిన ప్రముఖులు కొనియాడారు.



## భారత్ ఆదర్శ ప్రయోగశాల: ప్రధాని మోదీ



దిల్లీ: పరిష్కారాలను కనుగొనడంలో భారత్ ఆదర్శ ప్రయోగశాల అని ప్రధాని మోదీ అన్నారు. ఇక్కడ కనుగొన్న పరిష్కారాలను ప్రపంచంలో ఎక్కడైనా అమలు చేయవచ్చని పేర్కొన్నారు.జీ20 (ఉ20) డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ మంత్రులతో శనివారం బెంగళూరు వేదికగా జరిగిన సమావేశంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రపంచ సవాళ్లకు సురక్షితమైన, సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుందని మోదీ పేర్కొన్నారు. "భారత్ వైవిధ్యభరితమైన దేశం. ఎన్నో భాషలు, వందలాది మాండలికాలు ఉన్నాయి. ఇది ప్రపంచంలోని అన్ని మతాలకు, సాంస్కృతిక పద్ధతులకు నిలయంగా మారింది. పురాతన సంప్రదాయాల నుంచి నేటి సాంకేతికత వరకు భారత్ ఎంతో ప్రత్యేకమైనది. పరిష్కారాలను కనుగొనడంలో మన దేశం ఆదర్శవంతమైన ప్రయోగశాల. ఇక్కడ కనుగొన్న పరిష్కారాలను ప్రపంచంలో ఎక్కడైనా కచ్చితంగా అమలు చేయవచ్చు. త్వరలో ఏఐ పవర్డ్ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ ఫ్లాట్‌ఫాం 'భాషిణి'ని రూపొందిచను న్నాం. దేశంలోని అన్ని భాషలను అనువదించ డానికి ఉపయోగప డుతుంది" అని ప్రధాని వెల్లడిం చారు. డిజిటల్ ఎకానమీ రంగం లో భారత ప్రభుత్వం చేసిన ప్రయోగాలను ప్రధాని వివరించారు. తన అనుభవాలను ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా.. దేశంలోని వివిధ బ్యాంకుల్లో జన్ ధన్ ఖాతాలు 50 కోట్లకు పైగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాని స్పందిస్తూ.. "వీటిలో సగానికి పైగా ఖాతాలు మహిళల వే కావడం హర్షణీయం. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతా ల్లో 67 శాతం ఖాతాలు ఉన్నాయి. ఈ ఆర్థిక చేరిక ప్రయోజనాలను దేశంలోని ప్రతి చోటుకు చేరేలా కేంద్రం భరోసా ఇస్తుంది"అని ప్రధాని పేర్కొన్నారు.

# ఏపీ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హవా



గుంటూరు: రాష్ట్రంలో పలు జిల్లాల్లో జరిగిన పంచాయితీ ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కొక్కటిగా ఫలితాలు వెలువడుతున్నాయి. మెజార్టీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు..బలపర్చిన అభ్యర్థులే జయకేతనం ఎగరేస్తున్నారు. మొత్తం 35 సర్పంచ్, 245 వార్డు మెంబర్ల స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి.

నెల్లూరు:మనుబోలు మండలం, బండేపల్లి మూడో వార్డులో ఒక్క ఓటుతో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి ఆవుల పొలమ్మ విజయం.చేజర్ల మండలం పాతపాడు లో రీకౌంటింగ్ లోను సమాన ఓట్లు రావడంతో లాటరీ నిర్వహించిన అధికారులు. లాటరీలో వైసీపీ అభ్యర్థి షేక్.మస్తాన్ బి విజయంఏలూరు:దెందులూరు మండలం, కొవ్వలి గ్రామంలో జరిగిన 11వ వార్డు ఎన్నికలలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మొండి శ్రీను 288 ఓట్ల మెజారిటీతో విజయం. పెదపాడు మండలం, పాత ముప్పర్రు గ్రామంలో జరిగిన 10వ వార్డు ఎన్నికలలో వైఎస్సార్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గొట్టపు సోమేశ్వరి 26 ఓట్ల మెజారిటీతో విజయం.జీలుగుమిల్లి గ్రామంలో 6వ వార్డు ఉప ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన మడకం ధనరాజు 42ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.పెదపాడు మండలం వీరమ్మ కుంట గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపు. మరడాని వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు 286 ఓట్ల మెజారిటీతో టీడీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మరడన నాగబాబును ఓడించారు. పశ్చిమగోదావరి:పాలకొల్లు మండలం గోరింటాడా గ్రామపంచాయతీ ఆరో వార్డు వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థి పీతల యమున దుర్గ చంద్రకళ 15 ఓట్ల మెజారిటీతో గెలుపు.పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామంలో ఆరో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థి అంగర రామలక్ష్మి 10 ఓట్ల మెజారిటీతో గెలుపు.వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామం ఒకటో వార్డు లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన కారేంపల్లి విజయలక్ష్మి 167 ఓట్ల మెజారిటీతో గెలుపు. కృష్ణా:బంటుమిల్లి 4 వ వార్డుకి వైఎస్సార్‌సీపీ బలపర్చిన గొల్ల సృజన విజయంఎన్టీఆర్:తిరువూరు మండలం ఎర్రమాడు ఉప ఎన్నికలో ఏడో వార్డు అభ్యర్థిగా జూఖీఅఖ బలపరిచిన చలివేంద్ర హరిబాబు విజయం. తూర్పు గోదావరి: రాజానగరం మండలం పల్ల కడియం గ్రామంలో జరిగిన వార్డు సభ్యుల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ బలపరిచిన పెంద్యాల అరుణ సమీప అభ్యర్థి చేవా ప్రమీలాపై విజయం సాధించారు.

# తిరుమలలో చిరుత దాడి ఘటన విచారకరం

### చిన్నారి కుటుంబానికి 5 లక్షల ఎక్స్‌గ్రేషి చెల్లింపు
### తిరుమలల ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్నాం
### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి





తిరుపతి,అగస్టు19:తిరుమలలో చిరుతల సంచారంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించారు. చిరుతల దాడి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించామని, జరిగిన ఘటన చాలా బాధాకరమని చెప్పారు. మ్యాన్ ఈటర్‌గా మారిన రెండు చిరుతలను తిరుపతిలోని ఎస్వీ జూపార్క్‌లోని ఉంచుతామని స్పష్టం చేశారు. టీటీడీ పరిధిలోని అటవీ ప్రాంతంలో సంఘటన జరిగిందని, ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో టీటీడీకి సహకరిస్తామని పేర్కొన్నారు. తిరుపతిలో పోల్యుషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్, ల్యాబరేటరీని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమలలో 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉంటే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించామని, భక్తులెవ్వరూ తిరుమలకు తీసుకురావొద్దని సూచించారు. తిరుమలకు వచ్చే భక్తులకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్నామని, పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నియంత్రిస్తున్నామన్నారు. తిరుమల నడకమార్గంలో శాశ్వత ప్రాతపదికన కంచె ఏర్పాటు చేసే దిశగా టీటీడీ, అటవీశాఖ ఆలోచన చేస్తోందని, టీటీడీ దేవస్థానం నివేదిక వచ్చిన తర్వాత ఢిల్లీలో అటవీ డైరెక్టర్ జనరల్ అనుమతి తీసుకుంటామని పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బాగా పని చేస్తుందని, ఉద్యోగుల సంక్షేమం కోసం తాము కూడా పనిచేస్తున్నామని పెద్దిరెడ్డి తెలిపారు. త్వరలోనే ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమలో ఆక్వా పొల్యూషన్ తగ్గిస్తున్నామన్నారు. 1974లో నీటి నియంత్రణ మండలి, 1981లో కాలుష్య నియంత్రణ మండలి, 1976లో కాలుష్య నియంత్రణ మండలి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. తిరుమతిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్, ల్యాబరేటరీ భవనానికి డాక్టర్ వైఎస్సార్ పర్యావరణ భవనంగా నామకరణం చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.16.50 కోట్లతో 34 వేల చదరపు అడుగులతో ఈ నూతన కార్యాలయ భవనం నిర్మించామన్నారు. భవిష్యత్తులో జోనల్ కార్యాలయం తిరుపతిలో ఏర్పాటు చేసిన ఇదే భవనం సరిపోతుందని పెద్దిరెడ్డి తెలిపారు.

## కొండపి ఎమ్మెల్యేను గృహ నిర్బంధించడం దుర్మార్గం: నక్కా ఆనంద్‌బాబు

ఒంగోలు: తెదేపా నేత, కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని గృహ నిర్భందం చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మండిపడ్డారు. సీఎం జగన్ తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలివేటుగా మారిందని దుయ్యబట్టారు.పంచాయతీ, వార్డు సభ్యుడిని కూడా గెలిపించుకోలేని దుస్థితిలో జగన్ ఉన్నాడంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న వైకాపా నేతలను వదిలిపెట్టి తెదేపా నేతలను ఏవిధంగా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేకు స్థానికంగా తిరిగే హక్కు లేదా?అని ప్రశ్నించారు. దళిత ఎమ్మెల్యేకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ మండిపడ్డారు. కొండపిలో ప్రజాస్వామ్యయుతంగా పోలింగ్ జరిగేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని నక్కా ఆనంద్‌బాబు కోరారు.కాగా, ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకాల సర్పంచి ఉపఎన్నికలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

# సంపాదకీయం

ఆదివారం 20-08-2023

## ఆదాయం సరే.. భక్తుల భద్రత సంగతేంటీ...

సుమారు 1500 సంవత్సరాల క్రితం తిరుమలలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల ఆధ్యాత్మిక మనోభావాలకు నిలువుటద్దం అనడంలో ఎటువంటి సంశయం లేదు. ప్రతి రోజు ఎనభై వేల నుంచి లక్ష వరకు భక్తులు ఆపద మొక్కుల వారి దర్శన భాగ్యం కొరకు తిరుమలకు వస్తూ ఉంటారు. వారిలో ఇరవై వేల నుంచి ముప్పై వేల మంది వరకు అలిపిరి నడక మార్గంలో వస్తూ ఉండడం గమనార్హం. కనుక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, అలిపిరి నడక మార్గం యొక్క ప్రస్థానం, ప్రాముఖ్యత, పవిత్రతను పరిగణన లోకి తీసుకుని కంచె నిర్మాణం విషయంలో అటవీ శాఖ సానుకూలంగా స్పందించాల్సి ఉంది. భక్తులు, ప్రజల ప్రాణాల పట్ల అటవీ శాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని గత కొద్ది కాలంగా ప్రజలు భావిస్తున్నారు. సోమవారం ఉదయం చిన్నారి లక్షిత మృతదేహం లభ్యమైన శ్రీ నరసింహ స్వామి దేవాలయం సమీపాన సోమవారం ఉదయం ఒక చిరుత బోనులో చిక్కింది. అదే సోమవారం రోజు రాత్రి వేంకటేశ్వర యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్ లో చిరుత సంచరించి అక్కడి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసింది. అదేవిధంగా గతంలో కూడా అటవీ ప్రాంతం దాటి జనావాసాలైన తిరుపతిలోని రుయా ఆసుపత్రి, స్విమ్స్, పద్మావతీ ఆసుపత్రి ప్రాంగణాలలో చిరుత సంచరించి కలకలం సృష్టించింది. తిరుమల నడకదారిలో ఆరేళ్ళ లక్షిత అనే చిన్నారిని చిరుత బలి తీసుకోవడం బాధాకరం. జూన్ 23వ తేదీ కౌశిక్ అనే అయిదు సంవత్సరాల బాలుడు చిరుత దాడిలో గాయపడ్డాడు. ఇలా వరుస ఘటనలతో కాలిబాటన శ్రీవారి దర్శనానికి వెళ్ళే భక్తులు బెంబేలెత్తుతున్నారు. భక్తులలో నెలకొన్న భయాందోళనలు తొలగించి వారిలో ధైర్యం నింపవలసిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది. అందులో భాగంగా టీటీడీ పాలకమండలి నూతన అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, పోలీసు అధికారులతో ఇటీవల అత్యవసరంగా టీటీడీ హైలెవల్ కమిటీ సమావేశం నిర్వహించి భక్తుల భద్రతకు టీటీడీ అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం. ఆ నిర్ణయాలలో కాలినడకన తిరుమల వెళ్ళే ప్రతి భక్తునికి చేతి కర్ర ఇవ్వడం, అలిపిరి నుండి తిరుమల వరకు వన్య ప్రాణుల కదలికలు గుర్తించేందుకు అయిదు వందల కెమరా ట్రూప్లు, డ్రోన్ల ఏర్పాటు, కీలక ప్రాంతాలలో ఇరువైపులా ముప్పై అడుగుల వరకు ఫోకస్ లైట్ల ఏర్పాటు, అలిపిరి, గాలిగోపురం, ఏడవ మైలురాయి వద్ద సూచికలు, లఘు చిత్రాలు ప్రదర్శించి స్వీయ రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి భక్తులకు తెలియచేయడం, పన్నెండు సంవత్సరాల లోపు పిల్లలను ఉదయం అయిదు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల లోపు మాత్రమే నడక దారిలో శేషాచలవాసుని దర్శనానికి అనుమతించడం, ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను అనుమతించడం, జంతువుల సంచార పర్యవేక్షణ కొరకు వైల్డ్ లైఫ్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి దానిలో 24 గంటలు వైద్యులను అందుబాటులో ఉంచడం , తర్ఫీదు పొందిన ఫారెస్ట్ సిబ్బందిని అడుగడుగునా భక్తుల భద్రత కొరకు నియమించడం, నడక మార్గంలో వ్యర్థ పదార్థాలు వేసే హోటళ్ళ, దూకాణాదారుల యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు తీసుకుంది. నడక దారిలో గుంపులు గుంపులుగా వెళ్ళమని మరియు సాదు జంతువులకు ఆహారపదార్థాలు పెట్టవద్దని భక్తులకు టీటీడీ సూచించింది. కేంద్ర ఆటవీశాఖాధికారుల సూచనలకు అనుగుణంగా నడక మార్గంలో కంచె ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని టీటీడీ నిర్ణయించింది. నడక దారిలో కంచె ఏర్పాటు చేయమని దశాబ్దాల తరబడి భక్తులు ప్రభుత్వాన్ని,టీటీడీ అధికారులను కోరుతున్నారు. ఆ ప్రదేశంలో కంచె నిర్మించాలంటే కేంద్ర అటవీశాఖ ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. భక్తుల భద్రతకు టీటీడీ ఎంత ప్రాముఖ్యత ఇస్తుందో ! అటవీ శాఖ వారు కూడా వన్య ప్రాణుల ప్రాణాలు, భద్రతకు అంతే ప్రాముఖ్యత ఇస్తారు. ఈ పరిణామం వల్లే టీటీడీ అధికారులు, అటవీ శాఖా అధికారుల మధ్య సమన్వయం లోపించిందనే వార్తలు చాలా కాలంగా ప్రజలలో బలంగా ఉన్నాయి. పర్యవసానంగా భక్తుల భద్రతను గాలికి వదిలేశారనే అపవాదు టీటీడీ, ఫారెస్ట్ అధికారులు మూటగట్టుకోవడం శోచనీయం. అటవీ శాఖ సంపద, వన్య ప్రాణుల భద్రత విషయంలో అటవీశాఖ నియమాలు చాలా కఠినమైనవి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎంత కఠిన నియమాలు ఉన్నా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులు వెలసిన తిరుమల, దాని పరిసర ప్రాంతాలను ప్రత్యేక ప్రాంతంగా పరిగణన లోకి తీసుకుని కంచె నిర్మించే విషయాన్ని ప్రత్యేక అంశంగా అటవీశాఖ చూడాలి. ఈ పరిణామాలు అన్నీ అటవీశాఖ వైఫల్యాన్ని బట్టబయలు చేశాయి. పేలవమైన అటవీశాఖ పని తీరుపై ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగేటట్లు చేసింది. కనుక ఆటవీశాఖాధికారులు ఇప్పటికైనా మేల్కొని భక్తులు,ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి భక్తులు, ప్రజలలో నెలకొన్న భయాందోళనలు తొలగించాలి. అదే సమయంలో అటవీశాఖకు అన్ని విధాలా సహకారం అందించవలసిన బాధ్యత ఆర్థికంగా అన్ని విధాలుగా బలీయమైన స్థితిలో ఉన్న టీటీడీపై కూడా ఉందనేది నిర్వివాదాంశం.

# ఘనంగా సావిత్రిబాయిపూలే జ్యోతిరావుపూలే విగ్రహాల ఆవిష్కరణ

సావిత్రిబాయి పూలే జయంతి రోజును
ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్





పత్తికొండ, ఆగష్టు 19 విభారె న్యూస్ :ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాయలసీమ డివిజన్ అధ్యక్షురాలు ఈడిగ భారతమ్మ అద్వర్యంలో పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి,పూలే దంపతుల విగ్రహాల దాత బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు గ్రామ సర్పంచు కొమ్ము దీపిక, మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, మైనార్టీ నాయకులు అన్వర్ హుస్సేన్, విద్యా కమిటీ ఛైర్మన్ మధుసూదన్ మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి నక్కలమిట్ట శ్రీనివాసులు లు మాట్లాడుతూ విద్యార్థులు సావిత్రిబాయిపూలే జ్యోతిబాపూలే ల అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని వారు తెలిపారు. చదువుల తల్లి సావిత్రిబాయిపూలే జయంతి రోజును ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆధునిక భారతదేశంలోనే మొట్ట మొదటి సామాజిక ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని, మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తన భార్య ను ఉపాధ్యాయురాలు గా తీర్చిన ఘనత పూలే గారిదేనని వారు కొనియాడారు. జ్యోతిబాయి గారిని గురువులుగా ప్రకటించుకొని డా: బి.అర్. అంబేద్కర్ గారు రాజ్యాంగంలో విద్యకు సంబంధించినవి, రిజర్వేషన్లు, మరియు మహిళల హక్కులు పొందుపరిచారని తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా జరపాలని, అదేవిదంగా సావిత్రిబాయి పూలే జయంతి రోజును జనవరి 3 వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది.విజయ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పూలే దంపతులను ఆదర్శనంగా తీసుకొని ఉన్నత చదువులు చదవాలని పిలువు నిచ్చారు. నాడు వారు ఏ యే సమస్యలపై పోరాడారో నేడు అవే సమస్యలు కొత్త రూపంలో వస్తున్నాయని వాటన్నింటిపై చదువుతూ పోరాడాలని ఆమె పిలుపు నిచ్చారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుని ఆ స్పూర్తితో ప్రతి బహుజన బిడ్డ మరియు విద్యార్థులు ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రములో సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షు రాలు రుద్రాక్షల ఇందిరాదేవి మరియు బి.సి.సంఘం నాయకులు ఆస్పరి శ్రీనివాసులు, గంగన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మరియు ఎలీశమ్మ, ఈరమ్మ , హుస్సేన్ బీ,దస్తగిరమ్మ, రేవతి,ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

డాక్టర్ అంకిరెడ్డి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 19 విభారె న్యూస్ :-దోమ కాటు ద్వారా చికున్ గున్యా, మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వీటి నియంత్రణకు ముందస్తు జాగ్రత్త పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధులను నియంత్రించే అవకాశం ఉందన్నారు. వారానికి ఒకసారి డ్రైడేను పాటించి దోమలను అరికట్టాలన్నారు. నీరు నిల్వ ఉండే నీటి కుంటల యందు కిరోసిన్ లేదా ఆయిల్ బాల్స్ ను వేసి దోమల వ్యాప్తిని నియంత్రించాలన్నారు. రాత్రి నిద్రించే సమయాలలో దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలకు, తలుపులకు మెష్ లు బిగించడంతోపాటు రాత్రి వేళల్లో మస్కిటో కాయిల్స్, రీఫిల్స్ వినియోగించాలని తెలిపారు. వేపాకు పొగ పెట్టడం ద్వారా కూడా దోమలను నియంత్రించవచ్చన్నారు. ఎయిర్ కూలర్లు, ఫ్రిడ్జు, ఫ్లవర్ వాజ్ లలో నిలువ వున్న నీటిని తరచూ మార్చుతూ ఉండాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి పాత్రలు, నీటి తొట్లు. మొదలగు వాటిపై మూతలు ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పూల కుండీలు, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, కూలర్లు, ప్లాస్టిక్ టీ కప్పులు, గ్లాసులు, కుండ పెంకులు, సీసాలు మొదలైన వాటియందు నీరు నిల్వ లేకుండా చేయడం ద్వారా దోమ గుడ్లు పెట్టకుండా నివారించవచ్చన్నారు. ఇంటి ముందు మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు .

## పదోన్నతి పొందారు పెద్ద ఆఫీసర్ ను కలిసారు




నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 19 విభారె న్యూస్ :- ఇటీవల పదోన్నతి పొందిన సీఐలు ఎపి. మస్తాన్ కర్నూల్ జిల్లా ఇంటలిజెన్స్ నుండి నంద్యాల జిల్లా కు మరియు ఎస్ .సూర్యమౌళి నంద్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ నుండి నంద్యాల జిల్లా కు బదిలీ అయిన సందర్భంగా శనివారం నాడు నంద్యాల జిల్లా ఎస్పీ కె .రఘువీర్ రెడ్డి గారిని జిల్లా పోలీసు కార్యాలయం నందు పుష్పగుచ్చంతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## ముత్తుకూరు గౌడప్ప,గులాం రసూల్ ఖాన్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని వినతి

నగరపాలక ఇన్చార్జ్ కమిషనర్
రామలింగేశ్వర్ కు వినతిపత్రం అందజేసిన
ఆర్వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్



కర్నూలు, ఆగష్టు 19 విభారె న్యూస్ :కర్నూలు రాయలసీమ నుండి మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధులు ముత్తుకూరు గౌడప్ప గులాం రసూల్ ఖాన్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని నగరపాలక ఇన్చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ కు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్,రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న,ఆర్వీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్,ఎర్రకోట మల్లప్ప మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ 1801 ప్రాంతంలోనే బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి 15 రోజులపాటు వారితో యుద్ధం చేసిన గొప్ప వీరుడు ముత్తుకూరు గౌడప్ప అని దీనినే తెరినేకంటి ముట్టడిగా చరిత్రలో చెబుతారని 15రోజుల అనంతరం ముత్తుకూరి గౌడప్పను బంధించిన బ్రిటిష్ వారు తెర్నేకల్ ఊరవాకిలికి ముత్తుకూరు గౌడప్పను ఉరితీసారని బ్రిటిష్ వారితో ఎనలేని పోరాటం చేసిన ఆయన విగ్రహం జిల్లా హెడ్ క్వార్టర్ లో లేకపోవడం శోచనీయమని తక్షణమే ఆయన విగ్రహాన్ని కర్నూలు నగరంలో ఏర్పాటు చేయాలని వారు కోరారు. అలాగే 1839లో కర్నూలు నగరం వేదికగా బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన వీరుడు గులాం రసూల్ ఖాన్ తర్వాత కాలంలో వారిచేత బంధింపబడి విషప్రయోగం చేత మరణించారని ఆయన విగ్రహం కూడా కర్నూల్ నగరంలో లేదని వారి వర్ధంతి జయంతి లకు సైతం పూలమాల వేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే రాయలసీమ ప్రాంత మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధులు ముత్తుకూరు గౌడప్ప,గులాం రసూల్ ఖాన్ ల విగ్రహాలను కర్నూలు నగరంలో నూతనంగా నిర్మిస్తున్న కూడళ్లలో ఏర్పాటు చేయాలని లేని పక్షంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి,యువజన,ప్రజా సంఘాలకు అవకాశం కల్పిస్తే తాము వారి విగ్రహాలను ఏర్పాటు చేసుకుంటామని అది మేము గౌరవంగా భావిస్తామని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గురజాల అశోక్, వసంత్ కుమార్,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ×రాయలసీమ విద్యార్థి పోరాట సమితిఆర్ వి పి ఎస్.

## అంగనవాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అంగన్వాడిఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శ్రామిక
మహిళ జిల్లా కన్వీనర్ పి నిర్మల డిమాండ్ చేశారు

కర్నూలు, ఆగష్టు 19 విభారె న్యూస్ :కర్నూలు అంగనవాడి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ కు అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి గారు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు సదనంగా ఇస్తానని హామీ ఇచ్చాడని కానీ తెలంగాణలో వేతనాలు పెంచిన ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్లో మాత్రం పెంచలేదని విమర్శించారు అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆమె డిమాండుచేశారు అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు రిటైర్మెంట్ అయ్యే నాటికి ఉన్న జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు పరిష్కారం కోసం రాబోవు కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు మహమ్మద్ రఫీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రేణుకమ్మ బాలధర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గృహప్రవేశం

అనంతపురం ప్రతినిధి ఆగస్టు 19 విభారే న్యూస్ అనంతపురం రూరల్ మండల పరిధిలోని రాచానపల్లి గ్రామంలో సూర్యనారాయణ రెడ్డి నూతనంగా నిర్మించిన గృహాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ గృహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుర్తి ప్రకాష్ రెడ్డి, ఎంపీపీలు,జడ్పీటీసీలు, సర్పంచులు, అధికారులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరవడంతో సూర్యనారాయణ రెడ్డి ఇంటి ప్రాంగణం సందడి నెలకొంది. వచ్చిన అతిథులకు సూర్యనారాయణ రెడ్డి భారీ ఎత్తున విందును ఏర్పాటు చేశారు.



## ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవం



ఎమ్మిగనూరు ఆగష్టు 19 విభారె న్యూస్.ఎమ్మిగనూరు తాలూకా డిజిటల్ ఫోటో విడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.శనివారం పట్టణంలో సోమప్ప సర్కిల్‌లో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలామాల నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా తాలుక అధ్యక్షుడు రఘువీరా రెడ్డి మాట్లాడుతూ ఫోటో అనేది ఒక మధురమైన జ్ఞాపకమని అన్నారు. కష్టమర్లు దేవుళ్ళ తో సమానమని కావున కష్టమర్లను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. అదేవిధంగా ఫోటోగ్రాఫర్లందరూ ఉన్నతంగా జీవించాలని, రాబోయే కాలంలో దినోత్సవ వేడుకలు ఇంకా ఘనంగా జరుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లందరూ పాల్గొన్నారు.

## గో సంరక్షణ పథకానికి రంగారెడ్డి జిల్లా వాస్తవ్యుల విరాళం




శ్రీశైలం ఆగష్టు 16 విభారె న్యూస్.శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో గో సంరక్షణ పథకానికి విరాళంగా రూ. 1,01,000/-లను వి.మల్లికార్జునప్ప, రంగారెడ్డి జిల్లా వారు శ్రీశైల దేవస్థాన పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది. వీరికి దేవాలయం వారు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, శాలువాతో సత్కరించి, లడ్డు ప్రసాదాలను అందజేసి, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

## హార్ట్ ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయాలి

### మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు ఆగష్టు 19 విభారె న్యూస్.ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయాలని మాజీ యంపీ టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక ఎ.క్యాంప్ లోని



హెల్త్ క్లబ్ లో నూతనంగా ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ కు భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరవయ్యేళ్ల కిందట ప్రారంభించిన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించారని ఆయన అన్నారు.ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఆయన చెప్పారు.హెల్త్ క్లబ్ లో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని టీజీ వెంకటేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి డా. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డా. భవానీ ప్రసాద్, డా. వసంతకుమార్, సభ్యులు కేసీ రాముడు, నాగేశ్వర బాబు, లక్ష్మన్న, వాసు, ప్రహ్లాదరావు, జగన్నాథ గుప్త, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ రాజీవ్ గాంధీ 79 వ జయంతి కార్యక్రమము

కర్నూలు ఆగష్టు 19 విభారె న్యూస్. జిల్లా కాంగ్రెస్ కమిటీకార్యాలయం కళా వెంకట్రావ్ భవనం నందు ఆదివారం ఉదయం 10 గంటలకు మాజి ప్రధాన మంత్రి వర్యులు స్వర్గీయ రాజీవ్ గాంధీ 79 వ జయంతి కార్యక్రమం జరుగును.ఈ కార్యక్రమమునకు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు యం సుధాకర్ బాబు అధ్యక్షత వహించెదరు.ముందుగా స్థానిక సి క్యాంపు సెంటర్ నందలి రాజీవ్ గాంధి కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులు అర్పించుట, అనంతరం పార్టీ కార్యాలయం నందలి



రాజీవ్ గాంధి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యకర్తల సమావేశం జరుగును. ఈ కార్యక్రమమునకు కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు అనుబంధ సంస్థలయిన సిటి కాంగ్రెస్, ఐఎన్టీయుసి, మహిళా కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ,ఎస్ సి, ఎస్ టి, బి సి, ఓబీసీ సెల్, మైనార్టీ సెల్, కిసాన్ సెల్, డాక్టర్ సెల్, హ్యూమన్ రైట్స్, లేబర్ సెల్, సేవాదళ్, లీగల్ సెల్, కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమమును విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము.

## రక్త పోటు మరియు చక్కెర వ్యాధి కి గల సంబంధం



కర్నూలు, ఆగష్టు 19 విభారె న్యూస్ :భారతీయులు ఎదుర్కొంటున్న అత్యంత సాధారణ వ్యాధులలో అధిక రక్తపోటు ఒకటి.పురుషులు, మహిళలు మరియు పిల్లలు అందరూ ఈ వ్యాధికి గురవుతారు.చాలా మంది వ్యక్తులలో హై బిపికి సరైన కారణం మనకు తెలియదు.చాలా మంది వ్యక్తులలో ఒత్తిడి అనేది సాధారణ కారణం.ఇది మల్టిఫ్యాక్టోరియల్‌గా అంటే చాలా కారణాల వలన వచ్చినది అని భావించబడుతుంది మరియు సాధారణంగా వచ్చే రకాన్ని ఇడియోపతిక్ హైపర్‌టెన్షన్ అంటారు, అంటే కారణం తెలియదు అని అర్థం.ఇక రెండవ రకం ఆధారమైన కారణం ఎసెన్షియల్ హైపర్ టెన్షన్..ఎసెన్షియల్ హైపర్‌టెన్షన్ అని పిలవబడేది ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తో దగ్గరి సంబంధం కలిగి ఉందని రుజువులు పెరుగుతున్నాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ కు చక్కర వ్యాధికి దగ్గర సంబంధం ఉంది.. చాలామంది యువకులలో తగినంత ఇన్సులిన్ ఉన్న షుగర్ కంట్రోల్ కాకపోవడానికి కారణం ఈ ఇన్సులిన్ రెసిస్టెన్స్.. ఇన్సులిన్ నిరోధకత..ఇన్సులిన్ నిరోధకత: కు అత్యంత సాధారణ కారణం ఆహారంలో కార్బోహైడ్రేట్ ఎక్కువగా తీసుకోవడం మరియు దీర్ఘకాలిక ఇన్ఫ్లమేషన్ రియాక్షన్ ఉండే జబ్బులు ఉండడం....కావున షుగర్ వ్యాధికి బిపి వ్యాధికి దగ్గర సంబంధం ఉంటుంది.. పిండి పదార్థాలు,షుగర్, స్వీట్లు, ఎక్కువగా రైస్ తీసుకోకపోవడం మంచిది.. ఆ విధంగా ఇన్సులిన్ నిరోధకతను తగ్గించుకోవచ్చు.. ఇదే కాకుండా ఉరుకుల పరుగుల జీవితంలో పడి మనం స్ట్రెస్ ఎక్కువగా పడితే తొందరగా షుగరు బిపి రావడం హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్ లు రావడం జరుగుతుంది..కావున పరిగెత్తి పాలు తాగే కంటే నిలబడి నీళ్లు తాగడం మంచిది.. స్ట్రెస్ కు ఒత్తిడితో కూడిన జీవనానికి దూరంగా ఉండడానికి ప్రయత్నించండి.. మెడిటేషన్ యోగ లాంటివి చేయండి.. పిండిపదార్థాలు, స్వీట్లు, రైస్ తక్కువ తినండి.. డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి ఏం ఎస్ ఏం సి హెచ్ గుండె మరియు ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు, డిప్యూటీ సూపరింటెండెంట్,ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలువైస్సార్సీపీ హెల్త్ యూనివర్సిటీ అకాడమిక్ సెనేట్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మరియు పారామెడికల్ బోర్డు మెంబర్..ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ మెంబర్..

## ఈ నెల 25 నుండి ఎస్సై అభ్యర్థులకు దేహ ధారుడ్య పరీక్షలు



కర్నూలు ఆగష్టు 19 విభారె న్యూస్.ఏపీ ఎస్పీ 2 వ బెటాలియన్ లో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 25 నుండి దేహదారుడ్య (పిఎంటి, పి ఈ టి) పరీక్షలు జరగనున్నాయి.ఈ సంధర్భంగా శనివారం కర్నూలు ఏ పి ఎస్ పి 2 వ బెటాలియన్ లో జిల్లా ఎస్పీ ఏర్పాట్లను ఆరా తీసి, పరిశీలన చేశారు.పోలీసు అధికారులకు పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు.దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఏలాంటి పొరపాట్లకు తావు లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.దేహాదారుడ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి.సర్కార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు,డిస్పీలు విజయ శేఖర్,యుగంధర్ బాబు,కృష్ణమోహన్, రవికిరణ్,డిపిఓ ఏవో సురేష్ బాబు,సిఐలు, ఆర్ ఐలు ఉన్నారు.

## చేతికి పతంగ్ అందుతుందా...

హైదరాబాద్, ఆగష్టు 19, (న్యూస్ పల్స్) అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ కొత్త ఎత్తులతో.. పాత పొత్తులకు పదును పెడుతోంది తెలంగాణ కాంగ్రెస్. గతంలో ఆత్మీయులుగా ఉండి? కాలక్రమంలో, మారిన రాజకీయ పరిణామాలతో దూరమైన మిత్రులను తిరిగి దరి చేర్చుకునే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే కొన్ని రహస్య సమావేశాలు కూడా జరుగుతున్నట్టు ప్రచారం ఉంది. దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పార్టీకి సహజ మిత్రుడు ఎంఐఎం. 2014 ఎన్నికల నుంచి రెండు పార్టీల మధ్య దూరం పెరిగింది. కానీ.. ఇప్పుడు, మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో తిరిగి పాత దోస్తీని పునరుద్ధరించుకునే పనిలో ఉన్నట్టు తెలిసింది. గాంధీభవన్ నాయకత్వమే అందుకు చొరవ తీసుకుందని, ఆ దిశగా హైదరాబాద్‌లో పావులు కదులుతున్నాయని చెప్పుకుంటున్నారు.అదే సమయంలో.. అధికార పార్టీతో చెట్ట పట్టాలేసుకుని తిరుగుతున్న ఎంఐఎం.. క్లారిటీ లేని కాంగ్రెస్ పార్టీతో తిరిగి జత కడుతుందా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. అయిననూ పోయి రావలె.. అన్నట్టుగా టి కాంగ్రెస్ తన ప్రయత్నాల్లో తాను ఉందట. ఎన్నికల్లో తమతో కలిసివచ్చే మిత్రుల కోసం అన్వేషిస్తున్న గాంధీభవన్ అతి ముఖ్యనేత ఒకరు తాజాగా ఎంఐఎం అధినేతతో భేటీ అయ్యారట. దానికి ముందు ఆ అతి ముఖ్యనేత కాంగ్రెస్ పార్టీలోనే పెద్దలుగా చెప్పుకునే ముఖ్య నేతతో సమావేశమై కీలక చర్చలు జరిపినట్టు తెలిసింది. బుధవారం రాత్రి పొద్దు పోయాక ఎంఐఎం అధినేతతో కాంగ్రెస్ కీలక నేత సమావేశమైనట్టు సమాచారం.. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఏం చర్చించారు..? రాజకీయంగా కాంగ్రెస్, ఎంఐఎం కలిసి పనిచేసే అవకాశం ఉందా ? ఇప్పటికే కేసీఆర్‌తో మిత్రుత్వం ఉన్న ఎంఐఎం.. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంటుందా అన్న ప్రశ్నలు పొలిటికల్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కూడా.. ఎంఐఎం మా మిత్రపక్షమే.. వచ్చే ఎన్నికల్లో కూడా మాతోటే ఉంటుందని స్పష్టత ఇచ్చారు కేసీఆర్. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కి చెందిన అతి ముఖ్యమైన నేత ఎంఐఎం ముఖ్యలతో సమావేశం కావడంపై హాట్ హాట్‌గా చర్చ జరుగుతోంది. అదే సమయంలో మరో వార్త కూడా ప్రచారంలో ఉంది. దేశవ్యాప్తంగా బిజెపికి వ్యతిరేకంగా పెట్టిన ఇండియా కూటమిలో చేరమని ఎంఐఎం నేతల్ని అడగడానికి వెళ్ళారన్నది ఆ వార్తల సారాంశం. మరి ఇండియా కూటమిలో చేరడానికి మజ్లిస్ నాయకత్వం ఆసక్తిగా ఉందా? ఒకవేళ చేరినా? తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉందా అన్న ప్రశ్నలకు మాత్రం ప్రస్తుతానికి సమాధానం లేదు. ఎంఐఎంతో కలిసి పని చేస్తే.. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు నాలుగైదు జిల్లాల్లో కాంగ్రెస్ కలిసిచ్చే అవకాశం ఉంది. అందుకే? మజ్లిస్‌తో ఫ్రెండ్‌షిప్ పునరుద్ధరణకు టి కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారట. అయితే..ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ కి దూరమైన ఎంఐఎం ఇప్పుడు కలిసి రావడానికి బలమైన కారణం ఏముంది ..? అన్న చర్చ కూడా నడుస్తోంది. ఈ పరిణామాలపై అటు అధికార పార్టీ కూడా నజర్ పెట్టినట్టు సమాచారం. భేటీకి వెళ్ళిన నాయకులు మాత్రం అసలేం జరగనట్టే వ్యూహాత్మక మౌనం పాటిస్తుండటంతో? సస్పెన్స్ పెరుగుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఏ పార్టీ ఎలాంటి ఎత్తుగడని వేస్తుందోనన్న ఆసక్తి పెరుగుతోంది. ఎంఐఎం నేతలు కూడా ఎన్నికల దాకా మౌనం పాటించి సస్పెన్స్ పెంచుతారా? లేక త్వరలోనే కుండబద్దలు కొట్టేస్తారా అన్నది చూడాలి.

## మహిళపై దాడి... నివేదిక ఇవ్వాలని గవర్నర్ ఆదేశం

హైదరాబాద్, ఆగష్టు19, (న్యూస్ పల్స్)ఆడది అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగిన నాడే మనకు అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని మహాత్మాగాంధీ చెప్పిన మాట తరచుగా ఏదో చోట వినిపిస్తుంది. కానీ తెలంగాణలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు అర్ధరాత్రి సమయంలో ఓ మహిళపై ఇద్దరు పోలీసులు దాష్టీకానికి పాల్పడ్డారు. మహిళ అని కూడా చూడకుండా ఆగస్టు 15న రాత్రి 11 గంటల తర్వాత ఎల్బీనగర్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఆపై లాఠీలతో దారుణంగా కొట్టి ఆమెను హింసించడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఈ దారుణ ఘటనపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర స్థాయిలో స్పందించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన తమిళిసై... మహిళపై జరిగిన దారుణ ఘటనపై వెంటనే నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ లను ఆదేశించారు. 48 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. బాధిత మహిళకు అండగా ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీకి గవర్నర్ సూచించారు.ఆగస్టు 15 రాత్రి 11 గంటలకు ఎల్బీనగర్ చౌరస్తాలో పోలీసులకు ముగ్గురు మహిళలు కనిపించారు. స్థానికంగా ఇబ్బంది కలిగిస్తున్నారంటూ వారిని పీఎస్ కు తరలించారు. సెక్షన్ 290 కింద కేసు నమోదు చేశారు. తమను ఎందుకు తీసుకొచ్చారని మీర్‌పేటకు చెందిన మహిళ ప్రశ్నించగా.. విధుల్లో ఉన్న కానిస్టేబుళు శివశంకర్, సుమలత ఆ మహిళను లాఠీలతో దారుణంగా కొట్టారు. రాత్రంతా స్టేషన్ లో ఉంచి లాఠీలతో కొట్టారని బాధితురాలు ఆరోపిస్తోంది. అలాగే తన శరీరంపై లాఠీతో కొట్టినట్లుగా ఉన్న గాయాలను కూడా చూపిస్తోంది. ఆగష్టు 15వ తేదీ రాత్రి సమయంలో తాను ఇంటికి వెళ్తుండగా.. పోలీసులు వచ్చి వాహనంలో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారని.. సెల్ ఫోన్ లాక్కొని చిత్ర హింసలకు గురి చేశారని ఆరోపించింది. బుధవారం ఉదయం తనను ఇంటికి పంపించినట్లు చెప్పింది. అయితే ఆమె చేస్తున్న ఆరోపణలు అన్నీ నిజం కాదని.. ఎల్బీ నగర్ ఇన్ స్పెక్టర్ తెలిపారు. మీర్ పేట నంది హిల్స్ లో బాధితురాలు నివాసం ఉంటుండగా... ఆమెతో పాటు ఆమె బంధువులు అందరూ పోలీస్టేషన్ లో ఆందోళనకు దిగారు. ఎల్బీ నగర్ జంక్షన్ వద్ద ముగ్గురు మహిళలు పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం వచ్చిందని ఎల్బీ నగర్ డీసీపీ సాయి శ్రీ తెలిపారు. 16వ తేదీ తెల్లవారుజామున పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చామని.. ఐపీసీ - 209 సెక్షన్ కింది కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఈ కేసులో రాచకొండ సీపీ చౌహాన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు పోలీసులపై వేటు వేశామని చెప్పారు.

## ఎమ్మిగనూరు డిపో నుండి ఉరుకుందకు ప్రత్యేక బస్సులు

ఎమ్మిగనూరు ఆగష్టు 19 విభారె న్యూస్.ఉరుకుందలో జరుగు శ్రావణమాసం ఉత్సవాలను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఎమ్మిగనూరు డిపో నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.20 వ తేదీ ఆదివారం 10 బస్సులు,21 వ తేదీ సోమవారం 12 బస్సులు, 23 వ తేదీ బుధవారం 10 బస్సులు,24 వ తేదీ గురువారం 10 బస్సులు, ఇతర డిపోల నుండి 10 బస్సులు,27 వ తేదీ ఆదివారం 10 బస్సులు, ఇతర డిపోల నుండి 13 బస్సులు, 28 వ తేదీ సోమవారం 10 బస్సులు, ఇతర డిపోల నుండి 13 బస్సులు నడపబడునని ఉత్సవాలకు వెళ్ళు ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం కలగకుండా బస్సులో సౌకర్యం ఏర్పాటు చేశామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని డిపో మేనేజర్ అమర్నాథ్ విభారె ప్రతినిధితో తెలిపారు.



## ఈ నెల 25 నుండి ఎస్సై అభ్యర్థులకు దేహ ధారుడ్య పరీక్షలు



కర్నూలు, ఆగష్టు 19 విభారె న్యూస్ :కర్నూలు ఏపీ ఎస్ పి 2 వ బెటాలియన్ లో ఏర్పాట్లను పరిశీలించిన ... జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ . పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 25 నుండి దేహ దారుడ్య ( పి ఏం టీ, పి ఈ టీ ) పరీక్షలు జరగనున్నాయి. ఈ సంధర్భంగా శనివారం కర్నూలు ఏపీ ఎస్ పి 2 వ బెటాలియన్ లో జిల్లా ఎస్పీ ఏర్పాట్లను ఆరా తీసి, పరిశీలన చేశారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు.దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఏలాంటి పొరపాట్లకు తావు లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేహాదారుడ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి. సర్కార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు, డిస్పీలు విజయ శేఖర్, యుగంధర్ బాబు, కృష్ణమోహన్ , రవికిరణ్, డిపిఓ ఏవో సురేష్ బాబు, సిఐలు, ఆర్ ఐలు ఉన్నారు.

## 100 రోజుల ముందే జాబితా....

న్యూఢిల్లీ, ఆగష్టు 19, (న్యూస్ పల్స్)ఎన్నికలకు వందరోజుల ముందుగానే బీజేపీ పార్టీ నుంచి అభ్యర్థులను ప్రకటించడం అనేది ఊహించని పరిణామం. షెడ్యూల్ రాకముందే బీజేపీ ఎన్నికల కమిటీ భేటీ మల్లాగుల్లాలు పడటం మరో విశేషం. అయితే ఈ నేపథ్యంలో కష్టతరమైనటువంటి నియోజకవర్గాల జాబితాను విడుదల చేయడం వల్ల బీజేపీ ఎలాంటి సంకేతాలు పంపిందనేది పరిశీలిస్తే దక్షిణాది రాష్ట్రమైన కర్ణాటక వ్యూహం కనిపిస్తోంది. ఇక వివరాల్లోకి వెళ్తే కర్ణాటక ఎన్నికల సమయంలో అక్కడి అభ్యర్థును ముందుగానే ప్రకటించి విజయవంతమైంది కాంగ్రెస్ పార్టీ. పేర్లు ప్రకటించిన అనంతరం వెంటనే క్షేత్రస్థాయిలోకి అభ్యర్థులు బరిలోకి దిగిపోయారు. ముమ్మరంగా ప్రచారాలు చేసుకున్నారు. తమ పార్టీ అందించబోయే సంక్షేమం గురించి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. ఆ తర్వాత మెజార్టీ ఓట్లు రాబట్టుకోగలిగారు. అయితే ఇప్పుడు అచ్చం అలాంటి వ్యూహాన్ని బీజేపీ అధికార మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో అనుసరిస్తోంది. మధ్యప్రదేశ్‌లో 39 మంది అభ్యర్థులను అలాగే ఛత్తీస్‌ఘడ్‌లో 21 మంది అభ్యర్థులను ఖరారు చేసేసింది. అయితే వీటిలో ఎక్కువగా రిజర్వ్‌డ్ సీట్లు ఉండగా.. మరికొన్ని సీట్లు గతంలో బీజేపీ ఎన్నడూ కూడా గెలవనివి. ఈ నేపథ్యంలో గెలుపు కఠినంగా అనిపించే నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు వీలు ఉంటుందని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. వాస్తవానికి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి బాగానే ఉంది. అయితే మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రస్తుతం అధికారంలో ఉండగా.. ఛత్తీస్‌ఘడ్‌లో మాత్రం ప్రతిపక్షంలో ఉంది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అందరి కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించి మంచి ఫలితాలు రాబట్టడంతో ఇప్పుడు అదే వ్యూహాన్ని బీజేపీ ప్రయోగిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం మరో తరహా ఫార్ములాతో బీజేపీ దూసుకెళ్లేలా కనిపిస్తో?ంది.వాస్తవానికి తెలంగాణలో బీజేపీ అధిష్ఠానం ఇటీవల చేసిన మార్పుతో రాష్ట్రంలోని పార్టీ కేడర్‌లో ఒక్కసారిగా ఊపు తగ్గిపోయింది. బండి సంజయ్ లాంటి నేతను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని ఇప్పటికీ కూడా పార్టీ శ్రేణులు, ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే ఇటువంటి పరిస్థితిలో తిరిగి ఊపు తీసుకొచ్చేందుకు అధిష్ఠానం నుంచి మాత్రం పెద్దగా ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదు. ఇలాంటి నేపథ్యంలో.. మధ్యప్రదేశ్, ఛత్తస్‌ఘడ్ రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంపై వందరోజుల ముందుగానే దృష్టిపెట్టిన అధిష్ఠానం పెద్దలు.. అసలు తెలంగాణపై ఎందుకు దృష్టి పెట్టలేకపోతున్నారనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి బీజేపీకి 35 చోట్ల తప్పితే మిగతా ప్రాంతాల్లో గట్టిగా పోటీ ఇచ్చే నాయకులు లేరట. అందుకోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్ జాబితాల ప్రకటన చేసిన తర్వాత గానీ బీజేపీ తమ అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం లేదని తెలుస్తోంది. అయితే ఈలోపు గెలుపు గుర్రాల కోసం వెతుకుతున్నట్లు రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతున్నారు.

## ఆదివారం నాగుల చవితి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష పూజలు



కర్నూలు ఆగష్టు 19 విభారె న్యూస్.ఆదివారం నాగుల చవితి(నాగ చతుర్థి) శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషమైన రోజు. కనుక ఈ రోజు శ్రీ స్వామి వారికి వేదోక్తంగా పూజ చేసి, పాలతో అభిషేకం చేసిన వారికి అభిష్ట సిద్ది కలుగుతుంది. ఆరోగ్య సమస్యలు, సంతాన సమస్యలు, వివాహ సమస్యలు అన్నీ కూడా శ్రీ స్వామి వారి అనుగ్రహంతో తొలగి పోతాయి..స్వామి వారి కృపకు పాత్రులవుతారు.అభిషేకం -200/-సంప్రదించండి :శ్రీధర్ శర్మ -7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

# ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయండి

### ఓర్వకల్లు మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్



ఓర్వకల్, ఆగష్టు 19 విభారె న్యూస్ :అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు.శనివారం బుగ్గ రామేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్మాణ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో అనేక పోరాటాలు ఏఐఎస్ఎఫ్ నిర్వహించిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయకుండా జాప్యం చేస్తుందని అన్నారు. దీంతో విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి బయట కొనాల్సి వస్తుందని,పేద విద్యార్థులకు ఈ పరిస్థితి ఆదనపు భారం మోపుతుందని అన్నారు.అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తివేసి, విద్యార్థుల కడుపులు మాడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని, నాసిరకం వస్తువులను ఉపయోగించి,తూతుమంత్రంగా నూతన గదులను నిర్మించి,మరింత ప్రమాదకర స్థాయిలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు.విద్యార్థులకు ఇవ్వాల్సిన అమ్మఒడి,విద్యాదీవెన, వసతి దీవెన పూర్తిగా చెల్లించకుండా రకరకాల సాకులు పెట్టి, విద్యార్థులకు అరకొరగా చెల్లించి,చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. వసతి గృహాల్లో అనేక సమస్యలు తాండవం చేస్తున్నా, సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు.జీ.వో నం.77 ను తీసుకొచ్చి, ఉన్నత విద్యాను అభ్యసించే విద్యార్థులకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు.ఓర్వకల్లు లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్ పూర్తయిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి, డిగ్రీ చదవాల్సి వస్తుందని అన్నారు.అనేక సార్లు అధికారులకు,ప్రజా ప్రతినిధులకు విన్నపించినప్పటికీ కూడా ఎలాంటి స్పందన లేదని అన్నారు.కావున జిల్లాలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ఈ నిర్మాణ మహాసభలల్లో చర్చించి,భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ను రూపొందిస్తామని, ఈ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కరపత్రాలు విడుదల చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు నవదీప్,వినయ్,రాము,కళ్యాణ్, బాబు,హరి తదితరులు ఉన్నారు.

## 60 సంవత్సరాల కళ నెరవేరింది

### పుసులూరు గ్రామ ప్రజలు



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 19 విభారె న్యూస్ :-నంద్యాల మండలము పుసులూరు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా ముగిసింది. కుందూ నది అవతల ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహము కాలక్రమేణా దెబ్బతినడంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆలయ నిర్వాహకులు దండే దస్తగిరి తెలిపారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ గురువారం ప్రారంభమైన ప్రతిష్టా కార్యక్రమాలు గణపతి పూజ, పుణ్య ఆవాచనం, వాస్తు పూజ, నవగ్రహ పూజ, ప్రధానో హోమం, గ్రామోత్సవము, జలాధివాసము, ధాన్య, పుష్పవాసము, షయ్యాదివాసము, మూల జపహోమాలు, దర్శనము వంటి కార్యక్రమాలతో ప్రతిష్ట కార్యక్రమం శనివారం అత్యంత వైభవోపేతంగా జరిగినదని తెలిపారు. పుసులూరు గ్రామ ప్రజలు భారీగా పాల్గొని ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేశారని దండే నారాయణ తెలిపారు. పుసులూరు గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ఉన్న ప్రాంత ప్రజలు కూడా వచ్చి ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకొని అన్న ప్రసాదములి స్వీకరించి వెళ్లారని మాజీ సర్పంచ్ భవనాసి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థలదాత దండే నాగేంద్రప్రసాద్, దండే ప్రభాకర్, గ్రామ సర్పంచ్ రాగెల రాము, లాయర్ కృష్ణారెడ్డి, భవనాసి పుల్లయ్య, కరుణామయ స్కూలు కరస్పాండెంట్ దండే వెంకట్ నరేష్, దండే సుబ్బారెడ్డి, దండే ఆదిశేషు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హార్ట్ ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయాలి

### మాజీ ఎంపీ టీజీ వెంకటేష్



కర్నూలు, ఆగష్టు 19 విభారె న్యూస్ :ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయాలని మాజీ యంపీ టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక ఎ.క్యాంప్ లోని హెల్త్ క్లబ్ లో నూతనంగా ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ కు భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరవయ్యేళ్ల కిందట ప్రారంభించిన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించారని ఆయన అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఆయన చెప్పారు. హెల్త్ క్లబ్ లో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని టీజీ వెంకటేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి డా. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డా. భవానీ ప్రసాద్, డా. వసంతకుమార్, సభ్యులు కేసీ రాముడు, నాగేశ్వర బాబు, లక్ష్మన్న, వాసు, ప్రహ్లాదరావు, జగన్నాథ గుప్త, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో రైతన్నకి కష్టాలు ఏపి రైతు సంఘం



అనంతపురం ప్రతినిధి ఆగస్టు 19 విభారే న్యూస్ జగన్ ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాల పై పడుతున్న రైతులకు మాత్రం ఒక వంతు శాతం కూడా మేలు జరిగిన పాపన్న పోలేదని రైతులను నట్టేట ముంచాడని జగన్ ప్రభుత్వం పై ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి గోపాల్ మండిపడ్డారు ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనే అత్యంత కరువు ప్రాంతం అయినటువంటి అనంతపురం జిల్లాకి సకాలంలో ఆయకట్టుకి హెచ్ఐసి ద్వారా నీరు ఇవ్వటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు తుంగభద్ర డ్యాం నుండి దాదాపు 113 కిలోమీటర్ల దూరంలో కాలువ గండి పడి నీరు వృధాగా పోతున్న కనీసం అధికారులు కానీ పాలకులు గాని పట్టలేదన్నారు ఎంత నీరు ఆయకట్టుగా వెల్లాల్సి ఉంది నీరు ఎందుకు తక్కువ వస్తున్నాయి అన్న ఆలోచన కూడా లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం రైతులు గమనిస్తున్నారని తెలిపారు ఆయకట్ట కావలసిన నీరు అందక రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందన్నారు ఈ ఏడాది ఖరీఫ్ లో వర్షాభావ పరిస్థితిలో సగం విస్తీర్ణం కూడా రైతులు పంట సాగు చేసుకోలేకపోయారని అనుకున్న సమయానికి నీరురందక విత్తనాలు నాట్లు వేసుకోవడంలో రైతులు వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు శ్రీశైలం నుంచి అదనంగా నీరు తీసుకురావాల్సి ఉండగా అలాంటి ఆలోచనలు ఎందుకు చేయడం లేదు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు ఓటు వేసి గెలిపించిన ప్రజానీకానికి రైతులకి ఏ విధమైనటువంటి మేలు కానీ అభివృద్ధి కార్యక్రమాల ఆలోచనలేని జగన్ పాలన త్వరలోనే ప్రజలు బంగాళాఖాతంలో కలిపేస్తారని ఆరోపించారు ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు రమణ చెరువు సంఘప కే మనోహర్ తదితరులు పాల్గొన్నారు

## మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలు

### కనబడని సూచిక బోర్డులు

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 19 విభారె న్యూస్ :-నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల్ల అడవి ప్రాంతంలో అతి ప్రమాదకరమైన మూల మలుపులు. అనేక మంది తీవ్ర గాయాలపాలై మృత్యువడిలోకి వెళ్లిన సంఘటనలు జరిగాయి . ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డు ను చుట్టేశాయి.ప్రమాదాలకు నిలయంగా మార్చేసాయి.మూల మలుపుల వద్ద కనబడని సూచిక బోర్డులు. ఎదురెదురుగా వచ్చే వాహనాలకు రోడ్డు సరిగ్గా కనబడకపోవడంతోప్రమాదాలు జరుగుతున్నాయి.మూలమలుపులు ఎక్కువ గా దొర బావి, గరండాలు, మోత్కమాన్ రైల్వే వంతెన, చింతమాను, దాదా ఖాలేందర్ వద్ద ఉన్నాయి. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఆక్సిడెంట్లు ఎక్కువ గా జరుగుతున్నాయి.ఈ రహదారి గుండా రోజు ప్రముఖుల ప్రయాణం చేస్తున్నారు . అయినా వారికి రోడ్లను చుట్టేసిన చెట్లు, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేవనే విషయం కనిపించకపోవడం శోచనీయం. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను సరిచేసి , మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు, కోరుతున్నారు.



## దేశానికి ఏదైనా సమస్య వస్తే దాని పరిష్కారంలో మేమే ముందుంటాం అన్న అంబేద్కర్ స్ఫూర్తితో...

### జిల్లా సమగ్ర అభివృద్ధితి పోరాటంలోనూ కెవిపియస్ ముందుంటుంది



గోనెగండ్ల , ఆగష్టు 19 విభారె న్యూస్ :ఒకే దేశంలో ఉన్న ప్రజల మధ్య అంటరానితనం పేరుతో రెండుగా విభజించి పాలన కొనసాగిన ఆరోజుల్లోనే.. దేశానికి ఏదైనా ఉమ్మడి సమస్య వస్తే దాని పరిష్కారంలో మేమే ముందుంటాం అన్న అంబేద్కర్ స్ఫూర్తితో... కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు జరిగే పోరాటంలోనూ కెవిపియస్ ముందుంటుందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు తెలియజేశారు.శనివారం గోనెగండ్ల మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో కేవీపీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల ఉపాధ్యక్షులు మారేషు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి కరుణాకర్, మండల అధ్యక్షులు మాదన్న మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలతో పాటు నేటికీ కొనసాగుతున్న అంటరానితనంపై సమరశీల సామాజిక ఉద్యమాన్ని నిర్వహించాలని కెవిపిఎస్ తలపెట్టిందన్నారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రాష్ట్ర జాత మండలానికి వచ్చేలోపు మండలంలోని 27 గ్రామాలలో ఉన్న దళిత పేటలను సందర్శించేలా జీపు జాతను నిర్వహిస్తామన్నారు. దళిత రక్షణ యాత్రలో మండలం లోని దళితులంతా భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధిని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుండి 7 వరకు నిర్వహించిన మహాపాదయాత్ర కార్యక్రమంలో పాల్గొని 6 రోజులపాటు నడిచిన కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి కరుణాకర్ ను, 5 రోజులపాటు నడిచిన కేవీపీఎస్ మండల అధ్యక్షులు మాదన్న లను శాలువాలతో సన్మానించి, మొమెంటో ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో నరసన్న, చంటెన్న, శేఖర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## పవర్ లిఫ్టింగ్ లో లీడర్స్ మోడల్ స్కూల్ విద్యార్థి కి బంగారు పతకం

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 19 విభారె న్యూస్ :- పవర్ లిఫ్టింగ్ లో నంద్యాల లీడర్స్ మోడల్ స్కూల్ విద్యార్థి సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ జె.రవి రాకేష్ జీ తెలిపారు. శనివారం నాడు ఆయన ఓ ప్రకటన లో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వైజాగ్ లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్ ప్రెస్ పోటీలలో తమ విద్యార్థి మధు తేజ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్స్ 75 కేజీల పోటీలలో బంగారు పతకము మరియు బెంజ్ ప్రెస్ పోటీలలో కాంస్య పథకము సాధించాడని , మధుతేజ గతంలో కూడా జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో మొదటి స్థానం లో నిలిచారని తెలిపారు .మధు తేజ ను పాఠశాల ప్రిన్సిపల్ దీపాళి,ఉపాధ్యాయ బృందం తోటి విద్యార్థి ,విద్యార్థినులు అభినందించడం జరిగింది.




## రెవెన్యూ అంశాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేదించండి

### జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 19 విభారె న్యూస్ :-ప్రభుత్వం నిర్దేశించిన రెవిన్యూ అంశాలను కాల పరిమితి లోపు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్ని మండలాల తాసిల్దారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో భూసేకరణ, పిఓఎల్ఆర్ రీ సర్వే, చుక్కల భూములు, ఓటర్ల జాబితా సవరణ, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై తాసిల్దార్ లతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 340సి, 167కె జాతీయ రహదారుల భూములకు సంబంధించి భూ సేకరణ పూర్తయి పెండింగ్లో ఉన్న క్లైమ్ లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత నివేదికలను ఈనెల 24వ తేదీ లోపు సమర్పించాలని సంబంధిత మండల తహసిల్దార్లను ఆదేశించారు. భూ వివాదాలను పరిష్కరించడమే సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యమని...రీసర్వే ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలు పాటించి పక్కాగా పకడ్బందీగా చేపట్టాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో సర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు.అన్ని మండలాల్లో పెండింగులో వున్న ఫార్మ్ 6, 7, 8 లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న దాదాపు 5170 దరఖాస్తులను వేగవంతంగా, పారదర్శకంగా విచారించి ఈ నెల 21వ తేదీలోగా ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని తాసిల్దార్ లను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలు, ఇళ్ల పట్టాలకు అవసరమైన భూములు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. అన్ని మండలాల్లో పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో లో డిఆర్ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కామేశ్వరరావు, వెంకటశివ సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీవోలు, తాసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**